మౌలాలి అమరవీరుల స్తూపం అభివృద్ధికి చర్యలు

- బీఆర్ఎస్ నాయకుడు మారెడ్డి రాజశేఖర్ రెడ్డి

విశ్వంభర, మౌలాలి : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను చిరస్మరణీయంగా నిలుపుకోవడంతో పాటు భావితరాలకు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని అందించేందుకు మౌలాలి ప్రాంతంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం (అమరజ్యోతి) అభివృద్ధి, సుందరీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా లకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకునే ఈ స్మారక స్థూపాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు ఆకర్షణీయమైన చారిత్రక ప్రదేశంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మారెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలు ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల ఆశయాలు, వారి త్యాగస్ఫూర్తి ప్రతి తెలంగాణ బిడ్డకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. మౌలాలిలోని అమరవీరుల స్తూపం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని, ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్ర చరిత్రను ప్రతిబింబించే విధంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఉస్మాన్, ప్రసాద్, వంశీ తదితరులు పాల్గొని అమరవీరుల స్తూపం అభివృద్ధికి తమ మద్దతు తెలిపారు.

అక్రమ సెల్లార్ పై చర్యలు తీసుకోవాలి

విశ్వంభర, నాగోల్ : అక్రమ సెల్లార్, ఇంటి పర్మిషన్ తో కమర్షియల్ నిర్మాణం చేపడుతున్న భవనంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎల్బీ నగర్ నియోజకవర్గం టి ఎమ్మార్వీఎస్ ఇంచార్జ్ నరసింహ మాదిగ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన సురాబాద్ డివిజన్ పెద్ద అంబర్పేట్ సర్కిల్ పరిధిలో రోడ్ నెంబర్ 1 , సూర్యోదయ నగర్ కాలనీ లో 175 గజాలను అక్రమ సెల్లార్ నిర్మాణం, ఇంటి పర్మిషన్ తో కమర్షియల్ నడుపుతున్నాడని, ఎలాంటి ఫైర్ సేఫ్టీ లేకుండా రెస్టారెంట్ ను కొనసాగిస్తున్నాడని ఆ బిల్డింగ్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిబ్రవరి నెలలో ఇదే విషయంపై డిప్యూటీ కమిషనర్, ఏప్రిల్ నెలలో ఏంఏంసి కమిషనర్‌కి కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఆ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశ్వంభర, కందుకూరు : విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని కందుకూరు ఎ ఈ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2 మంగళ వారం న 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కెవి దెబ్బడగూడ, 11 కె.వి మఖాన్ ఫీడర్ ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించుటకై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకు మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకు సరఫరా ఉండదని తెలిపారు.

విచారణ చేపట్టి..నివేదిక ఇస్తాం

సరూర్‌నగర్ తహశీల్దార్ వేణుగోపాల్

విశ్వంభర, సరూర్ నగర్ : సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ ,నందిహిల్స్‌లోని పలు సర్వే నంబర్లపై హైకోర్టు స్టే ఇచ్చింది. గతంలో ఇచ్చిన ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ (ఓఆర్‌సీలను రద్దు చేసింది). ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి... తుది నివేదికను అందజేయాలని సూచించింది. ఆ మేరకు చర్యలు చేపడుతాం అని సరూర్‌నగర్ తహశీల్దార్ వేణుగోపాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. . ఈ అంశంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఆంక్షలు

1970 దశకం నాటి ల్యాండ్ రీఫార్మ్స్ ట్రైబ్యునల్ రికార్డులు ఇప్పుడు సంచలనంగా మారాయి. కర్మన్‌ఘాట్ గ్రామంలోని (సీసీ నంబర్ ఈ/2476,2477,2478,/1975) పలు సర్వే నంబర్ల భూములపై హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇనాందారు వారసులకు, ఇతర ప్రైవేటు భాగస్వాములకు నోటీసులు ఇచ్చి, ఆరు నెలల వ్యవధిలో విచారణ ముగించాలని ఆదేశించింది. అప్పటి వరకు ఈ సర్వే నంబర్లలోని భూములకు ఎలాంటి అనుమతులు ఇవ్వ కూడదని పేర్కొం ది. దీంతో రిజిస్ట్రేషన్లు, ఇంటి నిర్మాణానికి అనుమతులు నిలిపి వేస్తున్నట్లు అధికారులు చెప్పడంతో స్థానికుల్లో అలజడి మొదలైంది.

అసలు ఈ కేసు ఏమిటీ..?

ఇనాం భూములకు ఓఆర్‌సీలు జారీ చేశారనే అభియోగంపై దాఖలైన రిట్ పిటిషన్(డబ్ల్యూ పీ నంబర్ 11087/ 2004)పై హైకోర్టు ఇటీవల కీలక తీర్పును వెల్లడించింది. 2004 మార్చి 3న అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ జారీ చేసిన కామన్ ఆర్డర్‌ను రద్దు చేసింది. 1/11/1973లో ఈ ఇనాం భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో నిర్ధారించకుండా, ఓఆర్‌సీలు మంజూరు చేశారని, వీటిని రద్దు చేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. ఈ అంశంపై విచారణ జరిపి నివేదికను అందజేయాలని ఆర్డీఓను ఆదేశించింది. ఆ మేరకు రెవెన్యూ యంత్రాంగం విచారణకు సిద్ధమైంది. ఆరు మాసాల్లో నివేదికను అందజేయనుంది.

కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమం

- అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదు
- టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేసేవారు ఎప్పుడూ ఉంటారు
- ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తాం
- మీడియాతో మాట్లాడకపోవడం కంటే మాట్లాడటమే మంచిదని భావిస్తున్నాం
- టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం

విశ్వంభర, హైదరాబాద్ : తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదని, టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేసేవారు ఎప్పుడూ ఉంటారని అన్నారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పారు. ''మీడియాతో మాట్లాడకపోవడం కంటే మాట్లాడటమే మంచిదని భావిస్తున్నాం. అందుకే, ఇకపై 2, 3 నెలలకోసారి మీడియా సమావేశాలు నిర్వహిస్తాం. పరీక్షల విషయానికొస్తే కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమమైంది. ఈ విధానంలో పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నాపత్రం రూపొందించవచ్చు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష నిర్వహణ చాలా క్లిష్టమైంది. పరీక్షల నిర్వహణలో అనేక సంస్కరణలు తెస్తున్నాం. టీజీపీఎస్సీ పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే దిశగా వెళ్తున్నాం. ప్రతి నెలా 2, 3 నోటిఫికేషన్లు ఇస్తాం. ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉంది. ఇంకో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలు ఉన్నాయి. జూన్ 2న మూడు నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. 3,800 పోస్టులకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి వచ్చింది. 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి'' అని బుర్రా వెంకటేశం తెలిపారు.

అమీన్‌పూర్ కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ రఘునందన్ రావు

విశ్వంభర, సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా లింగంపల్లి చౌరస్తా బీహెచ్ఈఎల్ ఎక్స్ రోడ్డు నుంచి అమీన్‌పూర్ వరకు స్టేట్ రోడ్డు వాగుపై నిర్మాణంలో ఉన్న బాక్స్ కల్వర్టు రహదారి పనులను సోమవారం ఎంపీ రఘునందన్ రావుతో కలిసి అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పరిశీలించారు.క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఎంపీ, నిర్మాణ పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అమీన్‌పూర్ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం ఆనందంగా ఉందన్నారు. స్థానికులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు. ఈ ప్రాజెక్టు సాఫీగా కొనసాగేందుకు సహకరించిన ప్రభుత్వ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ స్టేట్ సెక్రటరీగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడుకు చెందిన పెండ్యాల విజయభాస్కర్ నియమితులయ్యారు ఈ మేరకు సోమవారం చింతలబస్తీలోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని అందుకున్నారు. వీరి వెంట వనమ విశ్వేశ్వరరావు, పులిపాటి ప్రసాద్, పలభట్ల ఆనందబాబు, కైలాస రామచంద్రరావు, ఆగిరి వెంకటేష్, నూకల వాసు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

విశ్వంభర, సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి సోమవారం జోగిపేట్ ప్రాంతీయ ఆసుపత్రి, తలేల్మ మరియు నేరేడిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది విధులకు సమయానికి హాజరవుతున్నారా లేదా అనే విషయాన్ని హాజరు పట్టికలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు.అనంతరం ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించి, అందుతున్న వైద్య సేవలపై వివరాలు సేకరించారు. ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఔషధ నిల్వలను తనిఖీ చేసిన ఆమె, గడువు ముగిసిన మందులు లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందించాలని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.వైద్యులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డా. కె. లలితాదేవి ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా సేవలు అందించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

విశ్వంభర, చేవెళ్ల : చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం చేవెళ్ల మండలం, మున్సిపాలిటీ పరిధికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేవెళ్ల మండలం మరియు మున్సిపాలిటీ పరిధికి చెందిన 38 మంది లబ్ధిదారులకు రూ.38,00,618 విలువైన కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేసినట్లు తెలిపారు. పేద, మధ్యతర గతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి

విశ్వంభర, సంగారెడ్డి : ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.జిల్లాలో డివిజన్ వారీగా, కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 73 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 05, ఆందోల్ డివిజన్‌కు 01, నారాయణఖేడ్ డివిజన్‌కు 9, జహీరాబాద్ డివిజన్‌కు 20 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు,, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై ఆప్ ఆగ్రహం

విశ్వంభర, హిమాయత్ నగర్ : తెలంగాణలో పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాదు హిమాయత్ నగర్ లోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధిక వ్యాట్ కారణంగా ప్రజలపై భారం పెరుగుతోందని పేర్కొన్నారు. పెట్రోల్‌పై సుమారు 35.2 శాతం, డీజిల్‌పై 27 శాతం వ్యాట్ విధిస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలపై ఇంధన ధరల భారంతో పరిస్థితి మరింత దిగజారుతోందన్నారు. రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు, పాలు, ధాన్యాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి జీవన వ్యయం అధికమైందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన ప్రభుత్వం ఆదాయం పెంపుపైనే దృష్టి పెట్టడం బాధాకరమని విమర్శించారు.పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న వ్యాట్‌ను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదలతో ఏర్పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ డిమాండ్ సాధన కోసం జూన్ 3న నకిరేకల్‌లో ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొంటారని చెప్పారు.ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో మండల అధికారులు

విశ్వంభర, వలిగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం వలిగొండ మండలం పరిధిలో లోతుకుంట గ్రామంలో గృహప్రవేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్ తో కలిసి లబ్ధిదారులకు నూతన గృహాలను ప్రారంభించి అందజేశారు.అలాగే, ఎంపీడీవో , ఎంపీఓ 37 గ్రామాల్లో హౌసింగ్ ఏఈ లు, ఒక్కో గ్రామానికి వెళ్లటం జరిగింది మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తమ తమ గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని సర్పంచులు, వార్డు మెంబర్లు మరియు ఇందిరమ్మ ఇండ్లు కమిటీ మెంబర్లు విజయవంతం చేయటం జరిగింది.లబ్ధిదారులు తమ సొంత ఇంటి కల నెరవేరినందుకు ఆనందం వ్యక్తం చేశారు. తమకు 5 లక్షలు కూడా ప్రభుత్వం నుంచి పొందటం జరిగిందని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమకు శాశ్వత నివాసం. కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థూలకాయ వ్యాధి నివారణ..

భారతీయ యోగ సంస్థాన్ ఐదు రోజుల శిక్షణ శిబిరం

విశ్వంభర, హయత్ నగర్ : ఓబేసిటీ రాకుండా ఎలా ఉండాలి, వచ్చాక ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో భారతీయ యోగ సంస్థాన్ అధ్వర్యంలో 5 రోజుల స్థూలకాయ వ్యాధి నివారణ శిక్షణ లో యోగ సాధకులకు అవగాహన కల్పించారు. వనస్థలిపురం హుడా సాయినగర్ యోగా సెంటర్ లో ముఖ్య వక్తగా డిస్ట్రిక్ట్ 3 జిల్లా అధ్యక్షులు జగన్ రెడ్డి గారు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆహార నియమాలు, జీవన విధానం, ప్రకృతి తో మమేకమై జీవించాలి ఆయన అన్నారు. మనిషి బరువు పెరగడం చాలా సులభం, దాన్ని వల్లనే అనారోగ్య సమస్యలు వస్తాయి, పెరిగిన బరువు తగ్గించాలిలంటే చాలా కష్ట పడాల్సి ఉంటుంది అని ఆయన అన్నారు. యోగా, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం మాత్రమే మనిషిని ఆరోగ్యంగా, ఆనందంగా ఉంచగలదు అని యోగ శిక్షకులకు వివరించారు. భారతీయ యోగా సంస్థాన్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు స్థూలకాయ వ్యాధి నివారణ... ఐదు రోజుల శిక్షణ శిబిరం తూర్పు జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విజయవంతగా ముగిసింది.

స్థూలకాయ నివారణ వ్యాధి 5 రోజుల శిక్షణ శిబిరంలో భాగంగా 28526 నాడు వినాయక నగర్ యోగా సెంటర్ లో మూడురోజుల పాటు శిబిరం కొనసాగింది.అనంతరం నాలుగవ రోజు డీర్‌పార్క్ యోగా సెంటర్ లో జరిగింది. చివరి రోజు హుడాసాయి నగర్ యోగా సెంటర్ లో ముగిసింది.ముఖ్య వక్తలుగా మొదటి రోజు రాష్ట్ర సెక్రటరీ సదానంద చారి గారు ,రెండవ రోజు ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్ భట్ గారు,మూడవ రోజు తూర్పు జిల్లా 2 ప్రెసిడెంట్ రామస్వామి యాదగిరి గారు, నాలుగవ రోజు తూర్పు డిస్ట్రిక్ట్ 6 ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు గారు, చివరి రోజు డిస్ట్రిక్ట్ 3 ప్రెసిడెంట్ జగన్ రెడ్డి పాల్గొన్నారు. 5 రోజుల పాటు సాగిన శిక్షణ శిబిరం లో దాదాపు 300 వరకు సాధికా, సాధికలు భాగం పంచుకున్నారు. ఈ కార్యక్రమం లో వినాయక్ నగర్ కాలనీ యోగా సెంటర్, ఎల్లారెడ్డి కాలనీ యోగా సెంటర్, రాజరాజేశ్వరి కాలనీ పెద్ద అంబర్ పేట సెంటర్, డీర్‌పార్క్ యోగా సెంటర్, హుడాసాయి నగర్ యోగా సెంటర్లు పాల్గొన్నాయి . అధిక సంఖ్యలో మహిళా సాధకులు ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు, సహాయ సహకారాలు అందించిన పెద్దలకు,కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి విలువైన సందేశం అందించిన వక్తలందరికీ, అలాగే సహకరించిన జోనల్ చీఫ్ లకు, జోనల్ సెక్రెటరీస్ లకు, సెంటర్ ఇంచార్జులు, తూర్పు జిల్లా 6 సెక్రటరీ ప్రభాకర్ గారు ధన్యవాదములు తెలిపారు.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS ప్రజా విశ్వంభర "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108